SR VENKATESVARA ORIENTAL SERIES No. 20.

Editor :— Prof. P. V. Ramanujaswami, M. A.

# సుభద్రాకల్యాణము

తాళ్లపాక తిమ్మక్క రచన

శ్రీవేంకటేశ్వరప్రాచ్యపరిశోధనశాలలో ఆంధ్రవాఙ్మయ పరిశోధకుఁడగు

వేటూరి ప్రభాకరశాస్త్రి

పరిష్కరించినది.

తిరుపతి

తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రాక్షరశాల

1950

T
81
T34S

University of Hyderabad
LIBRARY
Acc. No. 28931
Dated 31-8-87
Hyderabad - 500 134.

# పీఠిక

ఈ సుభద్రాకళ్యాణమును తాళ్ళపాకతిమ్మక్క రచించెను. తాళ్ళపాక అన్నమాచార్యునికి తిమ్మక్క, అక్కలమ్మ యని యిద్దరు భార్యలుండిరి. పెద్దభార్య తిమ్మక్కకు నరసింగన్న యను కుమారుడు చిన్నభార్య అక్కలమ్మకు పెద్దతిరుమలాచార్యుడను కుమారుడు నిద్దఱు కూతుండ్రును కలిగిరి. అందు పెద్దభార్య యగు తిమ్మక్కయే యీగేయకృతికి రచయిత్రి. సంగీత సాహిత్యచతుర యగు నీయిల్లాలి నేలిన యన్నమాచార్యుఁ డదృష్టవంతుడు.

౮౦౪ సంగీతము సాహిత్యము
శృంగారము చక్కఁదనము శీలము గల పు
ణ్యాంగనకిం బ్రియుఁడగు కవి
పుంగవుఁ డరయంగ నెంత పుణ్యాత్ముఁడో!"

తిమ్మక్క ప్రేయసిగా, భక్తిమయగేయరచన కవితగా, తత్కవితావల్లభుఁడు శ్రీవేంకటేశ్వరస్వామిగా, అన్నమాచార్యునకు లభించిరి. అతఁడు ధన్యుఁడు.

తిమ్మకర్తృకృతి యిది ద్విపదమంజరీవికార మనఁదగిన గేయరచన. శ్రీబాలపామరాదులు కంఠపాఠముగా నేర్వఁ దగినది. పాడఁదగినది. పూర్వ మట్లే సాగినది. ఈపాట లోని పలుకుబళ్ళు కొన్నికొన్ని చేమకూర వేంకటకవి విజయ విలాసముఁ జేరినవి. ఈగ్రంథకర్త అతని కన్నా నూరేండ్లకుఁ బూర్వకాలమున వర్తిల్లినది కాన దీనిలోని పలుకుబళ్ళు చేమ కూరకవి యనుకరించె ననవలెను. ఇందులో........మువ్వ గోపాల అనికలదుగాని అది మువ్వపురి గోపాలునిఁ బేర్కొనునది యనఁ గాదు. క్షేత్రయ 'మువ్వపురిగోపాలా' యని చెప్పెను గాన యది యట్లే యనవలెను. ఇక్కడ మువ్వలు దాల్చిన బాలగోపాలుఁడని యర్థము కావచ్చును. ఈ పాట నన్నయ భారతకథారచనము నధికముగా ననువర్తించు చున్నది. దీనివ్రాఁత ప్రతిలిపి పాటపాడెడు తీరున తీగసాగిన దీర్ఘాక్షరములతో నున్నది. శ్రీపామరాదులనోటఁబడి యీ పాట చాల రూపుచెడి శ్రీ కాళహస్తిరాజాగారి యాస్థాని నుండి తెచ్చిన తాళపత్ర గ్రంథసంచయములోఁ గానవచ్చినది. దీని నెంతో దిద్ది కొంత తీరునకుఁ దెచ్చితిమి. ఇట్లు దిద్దుటలో అచ్చు చిత్తులు చూచుటలో చిరంజీవి పంగనామముల బాల కృష్ణమూర్తి, విద్వాన్, శిరోమణి, బి.ఓ.యల్. (ఆనర్సు) నా సహోద్యోగి చాలఁ దోడ్పడెను. యథా మాతృక

ముగా చిరంజీవి విద్వాన్ సి. పార్థసారథినాయుడు పరిశోధన శాలా విద్యార్థి వ్రాసెను.

అన్నమాచార్యోత్సవము నాఁటి కాయన యిల్లాలి గేయరచనమును దీనిని వెల్వరింపవలయునని వడివడిగా దోష సహస్రము దిద్దను నన్నుఁ గిచ్చుచుండగా ప్రెస్సు మేనేజరు శ్రీ T. R నరసింహంగారు, కంపోజిటర్లు శ్రుతికలిపి వడిగా వారములో ముద్రణము ముగించిరి. ఈ ద్వితీయ వర్షాన్నమాచార్యోత్సవమున (విరోధి ఫాల్గున బహుళదశమి) వెల్వడిన యీ గ్రంథము, సర్వసమ్మతముగా శ్రీ సి. అన్నారావుగారు కమీషనరుగాను, శ్రీ సి. రామస్వామిరెడ్డిగారు పేష్కారుగాను, శ్రీ తిరుపతి దేవస్థానమున నుద్యోగించుటకును, భారతదేశము సంపూర్ణస్వాతంత్ర్యము పడయుటకును, జ్ఞాపకముగా వెలయుఁగలదు.

తిరుపతి
18-3-50

వే. ప్రభాకరశాస్త్రి.

# సుభద్రా కల్యాణము

తాళ్లపాక—తిమ్మక్క రచన

శ్రీరమావల్లభులు - శ్రీకృష్ణు లెలమి
ద్వారకాపట్టణము - తమ యేలుచుండ
శ్రీకాంతపతికృపను - జెలగి పాండవులు
ప్రాకటంబుగను ద్రౌ - పదిని బెండ్లాడి
రంత నింద్రప్రస్థ - మను పట్టణమున
సంతసంబున నున్న - సమయంబునందు
సురముని యేతెంచె - సుదతి పూజించె
అర లేక మ్రొక్కగా - నపుడు ద్రౌపదిని
దీవించి లోపలికి - దిరిగి పొమ్మనియె
నేవురితోఁ బలికె - నిల్లు నారదుడు
ఇంతుల కథలైన - నెంతవారికిని
చింతింప మదిలోన - చీకాకు గదురు
సుదతికై సుందోప - సుందుల చరిత
విదితముగ జెప్పెదను - వినుడంచు బలికె
సుందరికొఱకునై - సూడు పుట్టంగ
సుందోపసుందులు - మ్రంది మన్నైరి

కావున మీర లొ - క్కటఁ గాంత పొందు
గావింపరాదు సం - కటపాటు గదురు
ఒక్కొక్క రే డామె - యొక్కొక్కరినగర
మక్కువతోనున్కి - మర్యాద యగును
ఒక్కరి నగరిలో - నువిద యున్నపుడు
మక్కువ వేఱొకరు - మసల రాదచట,
ఏకాంత మరయక - యేగినవారు
వ్యాకులపడక యా - వనతి వర్జించి
తిరముగా నొక యేఁడు - తీర్థాళులందు
చరియించ వలె నని - సమయంబు చెప్పె
ఒప్పించె నారదుం - డొగి నేగె నంత
అప్పటినుండి - తా రైదుగు రట్లు
సమయంబు పాటించి - సాధ్వితోఁగలసి
ప్రమదంబుతో భూమి - పాలించు చుండ్రి
ఒకనాడాపురిని - నొక విప్రునింట
తెక్కలి మ్రుచ్చులు - ధేనువుల్ గొనుచు
చనిరి విప్రుం డంత - సవ్యసాచికిని
మొనసి ధేనువులకై - మొఱవెట్ట దొణఁగె
భూసురవర్యుండు - మొఱలిడ దెలిసి
భాసురంబుగ తన - ప్రతినను దలచి
ఆయార్తరవముల - కా ధనంజయుఁడు

ఆయుధశాలకు - నరుగంగవలసి
ధర్మనందనుఁడు తా - ద్రౌపది గూడి
కూర్మితో నుండుట - గూడ గుర్తించి
ఆభూమిదేవు నుడు - లడలు ధేనువుల
క్షోభలు మాన్పంగ - జూచి ధర్మువును
అనుచు నాయుధశాల - కరుదెంచి క్రీడి
తనువున నాయుధాల్ - తగదాల్చి పట్టి
తఱిమి యామ్రుచ్చుల - దండించి పసుల
మఱల నాద్విజునకు - మరియాద నొసగి
తనయన్న కడ కేగి - దండంబు వెట్టి
మును జేయుసమయము - మునుకొని చెప్పి
యెలమితో దీర్థముల - కేగెద ననగ
బలికె ధర్మజు డంత - బార్థుని తోను
నిను విడిచి యొక ఘడియ - నేనుండ లేను
నను విడచి యేరీతి - చనెదవో యన్న
కొమరొప్ప వచ్చితివి - గోవులకొఱకు
సమయభంగము లేదు - చనవల దనెను
మనము గావించిన - మర్యాద లన్ని
మనమె చేయకయున్న - మఱి ధర్మమేది ?
అనుచు ధర్మజుచేత - ననిపించు కొనియె
యన్న పాదములకు - నతిభక్తి మ్రొక్కె

వాయునందనునకు - వందనం బొనగి
కవలు మ్రొక్కినవారి - కౌగిట జేర్చి
ఆయతిథిచేతను - అనిపించుకొనియు
చనియె తీర్థములకు - శక్రనందనుడు
గరిమ పెద్దలు పుణ్య - కథలు జెప్పుచును
ధర ప్రదక్షిణము స - దా చరింపుచును
అక్కడక్కడగల - యఖిల తీర్థములు
వేడుక నాడుచు - విజయుండు కనియె
అంగవంగకళింగ - బంగాళములను
పార్థుండు గడిచెను - బహుదేశములను
గంగ స్నానము శేసి - కడు నియమునను
సంగతిగ నొకనాడు - జపతపంబులను
సాగింప నొక నాగ - కన్య యేతెంచి
కనుమాయ గావించి - యనురక్తి మించి
ఘనగతి నాగలో - కమునకు జనెను
మానంబు మాని యా - మగువ కిట్లనెను
మానిని వినవె జి - హ్మగలోకమునకు
నేనేల వచ్చితి - నీకు పేరేమి
పూని తెల్పు మని యా - పొలతిని నడుగ
నైరావతుండు జా - హ్నవికి వల్లభుడు
కౌరవ్య డనువాడు - కలడు తత్సుతుడు

నా పేరును వులూచి - నను గనిరి వారు
నీ పౌరుషమ్ములు - నీ రూపుమహిమ
పనిగొని గీతరూ - పమున వెల్లడిగ
విని నిన్ను గామించి - వేడ్క దెచ్చితిని
నా కోర్కె లీడేర్చు - నాకేశతనయ
కైకొను మనెడు నా - కాంత నీక్షించి
నారద సద్బ్రహ్మ - చారి యానతిని
నిగిడి యీ ధరమీఁది - నిఖిల తీర్థములు
పరగ చరించగ - సమయమ్ము గలిగె
పరగ ధర్మజునితో - పలికి వచ్చితిని
నీ మనోభీష్టంబు - నే నెల్లు దీర్తు
భామిని ! యనిన నా - పద్మాక్షు పలికె
ధర్మమిదియు ప్రాణ - దానము తోను
తుల దూగదని మహా - త్ములు పలుకుదురు
చేకొని తన్ను ర - క్షించిన మీకు
పాకశాసని ! వ్రత - భంగ మెక్కడిది
పరగ ధర్మ స్థితి - పాంచాలికడను
పరగ మీ చేసిన - సమయమ్ము కాద
అనగ ధర్మ స్థితి - కాత్మ మోదించి
అచట పుత్రుని గాంచి - ఆనాటి కొనగి
మనమున నుప్పొంగి - మఱునాడు వెడలె

కమలార్కు డుదయించు - కాలంబునందు
క్రమమున క్రిడి గం - గానది జేరె
తనవెంట వచ్చిన - ధారుణీసురుల
గనుగొని యర్చించి - కథలెల్ల జెప్పి
అర్థముల్ ధేను వ - హ్రములొ గావు
అర్థిలో భూసురుల - కమరకంబొనగ
అనిపికొని కొందరి - నందు గొందఱిని
నొనరగా చే కొని - యుదధి తీరమున
ఊర్వీధరుని పురు - షోత్తము గాంచి
పమ్మిన భక్తితో - ప్రణతు లొనర్చి
ఓ విశ్వపాలక - ఓ విశ్వకర్త
హో విశ్వరక్షక - హో జగన్నాధ
నీ యందు గల్గు నీ - నిఖిలలోకములు
మాయెడ కృప యుంచి - మమ్ము రక్షించి
హాయక నాకోర్కె - ఫలియింపజేయు
మనుచు నన్నుతి జేసి - యతనికి మ్రొక్కి
చనుతెంచె పర్వత - స్వామిసన్నిధికి
అతుర నహోబిలం - బా వెంకటాద్రి
వరుస నాపై కంచి - వరదుల గొలిచి
క్రమమున కావేటి - రంగనాయకుల
ప్రేమను దర్శించి - పిదప తానంత

అల దక్షిణమ్మున - వెలసిన యట్టి
అలరిన నదుల తీర్థ - ములనాడె క్రీడి
మునుకొని యటు పద - మూడవ నెలను
పనిబూని మణిపురి - పట్టణమ్మునకు
అరిగె నప్పుర మేలు - నవనీశ్వరుడు
బలవిక్రముడు చిత్ర - వాహనుం డపుడు
ఎదురేగి తోడ్తెచ్చి - హేమపీఠమున
వదలని భక్తితో - వాసవి నునిచి
అడుగుల నర్ఘ్యపా - ద్యముల బూజించె
సురపతి సుతుడు వ - చ్చుట వైపు దెలిసి
కౌంతేయు డిష్ట మా - ర్గమున జెప్పునని
యంతంత మది నుబ్బి - యర్జును జూచి
యేను నీ కొకమాట - నెఱిగించవలెను
మానవాధీశ్వర - మావంశ మందు
ఘన విక్రముడు ప్రభా - కరుడను రాజు
తనయుల కొఱకు దా - దదయ కెంతెంతో
తపసుజేసిన చంద్ర - ధరుడును మెచ్చి
అపుడు దానొకమాట - నరుసుగ బలికె
వసుధేశవరుడ నీ - వంశ వీరులకు
పౌనగంగ నొక్కొక్క - పుత్రుండు పుట్టు
అని యిచ్చె వరమీశు - డతని వరమున

గానకొని యొక్కొక్క - కొమరుండు పుట్టె
ఘనుడ నా కిప్పుడీ - కన్యక పుట్టె
తనయుల కొఱకుగా - తనయ నే ప్రోతు
కులకాంగికి సుద - యించు నాసుతుడు
నాలాయముగను మా - వంశమ్ము నిలుపు
వరపూజ తో పెంచి - వరునకీ కొమిరె
వరగ నిచ్చుట నాదు - భాగ్యమే కాద
యొసగ భూపతివి నీ - విందువంశ్యుడవు
పొసగ పెండ్లాడు నా - పుత్రిక ననిన
కవ్వడి దానికి - కను సంతసిల్లి
నివ్వటిల్లెడి కోర్కె - నెలత పెండ్లాడె
అంగజాదేవి చి - త్రాంగద గూడి
పొంగుచు నంతనా - పురము చెంగటను
అయ్యర్జునుడు వసు - ధామరుల గూడి
చయ్యన జనుదేర - జలధి తీరమును
స్నానము చేయగ - వసు కట్టియున్న
పూని యక్కడి ముని - పుంగవుల్ విజయు
గనిరి యాకొలను మ - హాదుర్గమమ్ము
ఘనతరగ్రాహనం - కలితమ్ము నగును
పార్థుడ యిచ్చోట - భరితమ్ములైన
తీర్థరాజమ్ములు - దీపించు నైదు

పలలితముగను బ్ర - సన్న తీర్థమ్ము
ఫలదమైనట్టిసౌ - భద్ర తీర్థమ్ము
శోభింపగాను పౌ - లోమతీర్థమ్ము
పావనంబౌ భర - ద్వాజతీర్థమ్ము
కారుణ్యమయుడ యీ - కారంధమంబు
ధారుణిలో ప్రసి - ద్ధమ్మయి యొప్పు
బలభేది సుత ! యట్టి - బల్లిదు లైన
చెలగి యీ కొలకులు - చేర నోడుదురు
అని చెప్పగా దాను - వినియు నర్జునుడు
వచ్చి యీఘనసరో - వరములో జొచ్చి
యిచ్చమై తీర్థమ్ము - లే నాడవలెను
అనుచు నయ్యర్జునుం - డతిసాహసమున
అయెడ సౌభద్ర - మనియెడి కొలను
వరగ ప్రవేశించె - జలమధ్యమునకు
కడు నుగ్రగతి మహా - గ్రాహ మేతెంచి
తను డాయ దాని ను - ద్దండత బట్టి
బహు పరాక్రమశాలి - బైట పడవేసె
నక్రరూపము మాని - నాతియై నిలిచె
శక్ర నందనుడు నా - శ్చర్యపడి చూచె
ఇదియేమి భామ నీ - వింతకు ముందు
వదంక యీసరో - వరములో నుంటి

జలచరాకృతి మాని - జలజాక్షి వైతి
వలనుగా నెఱిగించ - వలెను తత్ క్షణమె
మత్తాక్షి నీవు ముశ - మకరివై యుండి
యిచట భామిని యపుట - కిరవేది చెపుమ
అనఘుడ నే వంద - యానెడి యచ్చరను
ధనదునకును గూర్చు - దాన నాసఖులు
సౌరభేయి సమీచి - జయులతల్ వారు
నలుగురు తనయట్టె - నక్ర రూపమున
జలధిలో నున్నారు - శాప విముక్తి
ననువొంద గాపించు - మనిన నర్జునుడు
యేమి కార్యమ్మున - నిట్టె చందమున
భామిని యిది మీకు - పాటిల్లె ననిన
ఇంద్రనందన వీను - జేంద్ర యేపురము
యింద్రాదిలోకము - లెల్ల కన్గొనుచు
ధరణిపై ఘన తపో - ధను లున్న వనము
గనుగొని యందగ్ని - కల్పుడౌనొక్క
బ్రాహ్మణుని తపస్సు - భంగమ్ము చేయ
తలచిన నలిగి యా - తాపసోత్తముడు
చలము మీఱగరాని - శాపము బెట్టె
భయమున నాముని - ప్రార్థన చేయ
దయజూచి యాతపో - ధను డిట్లు పలికె

సాహసుం డెవ్వడీ - సరసిలో చొచ్చి
బాహుల మిము బట్టి - బయట వేయంగ
నోపునో మీశాప - ముడుగు నాక్షణమె
పోపొండి మీరుమీ - భూమికి ననుచు
చనుదేర నారద - సంయమి వచ్చి
సతులాల యీముని - శాప వాక్యమ్ము
మిక్కిలి క్రూరమే - మిట మాన్పరాదు
తిరలుదు మీకింక - దక్షిణాంభోధి
తటమున పంచతీ - ర్థములు శోభిల్లు
అటుచని నూరేండు - లందుండు దనెను
ఒకనాడు ఫల్గునుం - డు ర్విపై కరిగి
సకల తీర్థముల ద - ర్శనకాంక్ష వచ్చి
స్నానము జేయ మీ - శాపము దీరు
అనిచెప్పి నారదుం - డరిగె తనంత
మీరాక గోరగా - మీరు వేంచేయ
నరయుగ ధన్యుల - మైతిమి మేము
నరు దవ్వు డారీతి - నలుగుర సతుల
కరుణించి శాపము - కడతేర్చి నంత
మగువల వీడ్కొని - మణిపురి పురికి
మగుడ నేతెంచి న - మ్మదిని కొన్నాళ్లు
అంగన యుండెఁ జి - త్రాంగద యింట

అనఘుండు బభ్రువా - హనుడను సుతుని
వరచిత్రభును చిత్ర • వాహానువంశ
కరునిగా నొనరి యా - కాంత దిగ విడచి
స్థిరముగా గోకర్ణ - దేవు దర్శించి
అరిగె నవ్వలిపార్శ్వ - మంబుధిచెంత
పావనంబైన ప్ర - భాసతీర్థమున
భావజాకారుడు - పార్థుడుండగను
చేరువ నంత నా - శ్రీకృష్ణుడుండు
ద్వారకాపురియని - తగు మునుల్ పలుక
నీలమేఘశ్యాము - నిఖిలాభిరాము
లాలితశుభగాత్రు - లక్ష్మీకళత్రు
ఆకంజదళనేత్రు - నలరి సేవింప
నాకోర్కె చెల్లగ - న్నన సమకూడు
గదునిచే మును వింటి - కన్య సుభద్ర
ముదిరాక్షి సుకుమారి - మత్తేభగమన
గుణవతి యనగ ను - క్కున చూడ వలెను
ఘనమైన నా కొమ్మ - కనుగొనవలెను
అనుచు ధనంజయుం - డా ద్వారవతికి
చన నున్నతలపున - సకలయాదవులు
యతుల బూజింతు రగ - మతిగల్గి కపట
యతివేషధారియై - యలరి యర్జునుడు

భుక్తిము క్తిప్రియు - పుండరీకాక్షు
భక్తవత్సలు కృపు - పరమాత్ము కృష్ణు
తత్తరపడక చి - త్తమ్ములో మునిచె
అత్తటి శౌరి స - న్యాత్మకు డగుట
అంతనా నరునితల - పంతయు దెలిసి
యొక్కరుం డేతెంచె - నొనర నచ్చటికి
నరుడు నచ్చెరు వంది - నారాయణునకు
నరగున ప్రణమిల్లి - సద్భక్తి మ్రొక్కె
వనమాలి యెదురుగా - నచ్చి యర్జునుడు
దండప్రణామమ్ము - తగ నాచరించె
నారాయణా యనుచు - నవ్వుచు నరుడు
కరము బట్టుక వాని - కదూ లేవ నెత్తె
హరియు నవ్వుచుం బల్కె - నర్జును జూచి
నిన్ననే సుతుల గని - నెఱితనమ్మునను
యింతలో సన్యాసి - కెట్లయితి వయ్య
యెరుగుదుము మీవిద్య - లెల్లను మేము
గరిమ వేసా లల్ల - గ్రాసాలకొఱకె
అని గేలి సేయుచు - నతని దోకొనుచు
చనుదెంచె రైవత - శైలమ్ము కడకు
అచట నర్జును నుంచి - హరియు నంతటను
నడనడచి ద్వారకా - నగరి కేతెంచి

కొలువులో యాదవ - కోట్లను గొలువ
బలదేవుతోడను - పద్మాక్షు డనెను
తాలాంక ! సకలయా - దవులతో గూడ
వాలాయముగను రై - వతమహోత్సవము
జరుపంగవలె నని - శౌరి శాసనమె
సమరసమ్మున పురి - సాటించు మనిరి
సకలపౌరులు నొప్ప - సాటించి రెలమి
పప్పు బూరెలు నెయ్యి - పాయసాన్నములు
కాయగూరలు పెక్కు - కలవంటకాలు
ఊరుగాయలు నెయ్యి - వొబ్బట్లు వడలు
గారెలు బూరెలు - కండమండిగెలు
అరటిపండులును రా - జాన్నరాసులును
పిండికూరలు మొదల్ - పెద్దకుడుములును
గరిడలక్షుటముల - గంపల నునిచి
ముందఱ నడిపించె - మురజవాదములు
సంతోషఘోషముల్ - సంకులమ్ముగను
పడుచులు పెద్దలు - బాలింతరాండ్లు
కొడుకులు కోడండ్లు - కూతు లల్లుండ్లు
తోతొక్కులాడుచు - ద్రోవ కిక్కిరిసి
చనిరి యాదవు లంత - సంభ్రమమునను
అంతంత చతురంత - యానంబు లెక్కి

అంతఃపుర స్త్రీలు - నంత నేతేర
నుద్ధవసాత్యకు - లుభయపార్శ్వముల
బద్ధానురాగులై - బలసి తఱి గొలువ
అప్పుడు శ్రీకృష్ణు - డన్నయు దాను
క్రొత్తముత్యమ్ముల - గొడుగుల నీడ
సురలెల్ల చనుదెంచి - చూడగా నపుడు
గరుడధ్వజాంకిత - ఘనరథం బెక్కి
ఆయచలమ్మున - యాదవుల్ గొలువ
తడయ కప్పుడు రైవ - తకమున నిడిచె
ఆయచలమునకు - యాదవుల్ వచ్చి
ఆయతభక్తితో - నర్చించి మ్రొక్కి
అపుడు సుభద్రయు - నాక్షణమ్మునను
పణతియు బంగారు - పల్లకి నెక్కి
చామ రుక్మిణిసత్య - భామ రేవతియు
దేవకి వసుదేవ - దేవు లందరును
వారివారికి తగు - వాహనా లెక్కి
వచ్చిరి రైవత - పర్వతమునకు
కొమ్మలు పదివేలు - కొలుచుచు రాగ
సమ్మతిగ నేతెంచి - సంభ్రమమ్మునను
వానవిసుతుఁడు తన - వరుడు కావలసి
ఆయచలమునకు - నాయింతి మ్రొక్కి

ఆసమయమ్మున - నర్జునుఁడు తనదు
మదిలోన తలపోసి - మగువరూపమ్ము
దండ లావణ్యమెం - తయు రూపుతోను
వుండునో యనుచు ని - ట్లాగి కొంతసేపు
యింతిమోముకు చంద్రు - డీడైన నేమి
కుంతలాలాకలిమి - కొదమతుమ్మెదలు
బాలకనుబొమ్మలకు - ప్రతియౌనువిల్లు
పాలించు ముత్యముల - వణతిచిర్నగవు
వతినాన తిలవృష్ప - సమమైన శేమి
అతివ మ - ధ్యమ్ము సింహాయునకు నరియౌ
అస బోల్పతగు నుంద - రాంగియువ్వనము
కనుగొని పెక్కంద్రు - కాంతలు గొల్వ
కవ్వడి గనుగొని - కమలాక్షు డనియె
కనుచూపి నంతలో - కాంక్షింప తగున
మొదల సుభద్రపై - మోహంబు నీకు
వదలక యుండుట - వడి యెఱుంగుదుము
తలపు నీ కీడేరు - తలకకు మనుచు
జలజాక్షు డావేళ - చెలిని రప్పించి
వందనము జేయించె - వరమునీంద్రునకు
పాండవద్విజులకు - పార్థు డివ్వోట
దండియై యుండుట - తగ నాలింగించ

వడిగ నేగులవారి - వలన పంపించె
బలదేవు జూచి యా - పద్మాక్షు డనెను
ఎక్కడనుండి యో - యీ పర్వతములకు
నరదు మెవ్వరో కాని - యతి వచ్చినాడు
పొసగ చాతుర్మాస్య - పూజ చేయుదము
అని పెడబాటుగా - అన్నతో బలికె
నడనడచి ద్వారకా - నగరి కేతెంచె
అప్పుడు బలభద్రు - డాముని జూచి
భక్తితో నిల్చిని - ప్రార్థన చేసె
పొసగ చాతుర్మాస్య - పుణ్యవ్రతంబు
జరుపు మా నగరాన - సంయమినాథ
అని తోడుకొనివచ్చి - రా ద్వారకను
రావె యమ్మ సుభద్ర - రమణిరో నీవు
మదిరాయతాక్షి నా - మనవి చేకొనవె
కన్యచే భిక్షయె - కాని యీ తండు
అన్యులచే భిక్ష - నంద నొల్లండు
కన్యాగృహంబున - కన్య కామణివి
సన్యాసి నునిచి పూ - జావిధి చేయు
మనుచు చెల్లెలికి స - న్యాసి నొప్పించి
ఆపద్మనాభుండు - అపు డూరకుండె
ముల్లెలసంచునా - కొత్త బిందెలను

అత్తరి జలక మా - యత్తమ్మ జేసె
యేవేళ కా మాని - యిష్టమ్ము లెఱిగి
ఆవేళ కావించు - నఖిల వస్తువులు
పొలుపైన రత్నాల - బొమ్మరింటికిని
తళుకైన పగడాల - దారబందములు
పచ్చల తలుపులు - పన్నారు గురుగు
లచ్చంపు దంతాన - నమరు బొమ్మలును
చెఱగుల యంచుల - జీనివ్రాతలును
చిరుతపావళ్లు మఱి - చెంద్రకావులును
బంగారు బొమ్మలకు - బాగుగా కట్టి
శృంగార మమరించె - చెలియ సుభద్ర
బలసి సుభద్ర శో - భనము చేయుగను
అరుదెంచి కవ్వడి - అతివ కిట్లనెను
ఇందు పురోహితుం - డెవ్వరె నీకు
అందమైనట్టి ఘడి - యారమ్ము నేడె
అన్నియు నేల నీ - యాశ్రితుడ నేని
యున్నాను నీపెండ్లి - నొనర జేయించ
పప్పు బూరెలు మంచి - పాయసాన్నములు
వొప్పైన భిక్ష మా - కొనరగా గద్ద
వన్నారు గురుగుల - పంచభక్ష్యములు
నన్నిక భుజియించె - నెలమితో నగుచు

తెరయొద్ద నిలుచుండి - దేవేంద్రసుతుడు
సరసిజవదనతో - సరసమ్ము లాడు
భావగర్భితముగా - పలుకు మర్మములు
భావించి సతిజూచి - పరగ తమకించు
చెలియ లక్షణములు - చెప్పెద ననుచు
కలికి నాయొయ్యార లేమ - కరము చేబట్టి
లక్షణసౌందర్యము - బది యొంట గద్దు
లక్షణ సౌభాగ్య - మది యింట గద్దు
పద్మరేఖలు నీకు - భాసిల్లు ననుచు
పద్మాక్షి పాదముల్ - భావించి చూచె
సన్యాసమ్ము లందగా - వెలదిరో గుఱుతు
ముడి వడె హారముల్ - ముద్దుల గుమ్మ
చిక్కు విడిపింతు నే - చేడె సుభద్ర
మక్కువ నామీద - మఱవకు మనెను
వేదోక్త యుక్తిని - వింత పెండ్లింట్లు
కావించవలె నంద్రము - ఘనశోభనమున
నాలవ దినమున - నాగ వల్లికని
శోభనం బగు గదే - సుదతి యిద్దఱకు
పానుపుటింటికి - పరగ బొమ్మలను
కదువేగ నంపుదము - కమలాయతాక్షి
అనుచు కందువ మాట - యతి తను బలుక

నివ్వెరపడి యుండె - నెలత సుభద్ర
ఇటు యెన్నొ రీతుల - మాయాతపసి
నెఱవక తనుజూడ - వెఱగందె నబల
గ్రక్కున శ్రీకృష్ణు - కడకు నేతెంచి
మొక్కిడి యతివరుం - డితడు వోయున్న
నూడ సంయమి గాని - చూడగా డితడు
ఆడెడి మాటలి - ట్లని పల్కరాదు
సగనమాడగ వచ్చు - సారె నాతోను
సొంపు నొయ్యారంపు - చూపులే తెలుపు
ఇత్తటినే భిక్ష - మిడి యింత దాని
చిత్తున భుజియింప - పొలతి చెప్పెనను
ఎంత చేసితిరి మీ - రిటువంటి వారి
నంతఃపురమ్ములో - నన్నమా యనుచ
అన్న యీ సన్యాసి - ననువుమా చేగ
ఎన్నికబూజింప - నే దగవు గాదు
తన్ను జూడగ నిల్వ - తగవుగా దితడు
కటకట యిటువంటి - కపట సన్యాసి
నెటువలె బూజింతు - నిందిరారమణ
అనిన నవ్వుచు గృష్ణు - డా యతీశ్వరుని
వినయమ్ములో బిల్చి - వేడ్క సెల్లెనను
అయ్యా మీ పను లన్ని - అగడా లాయె

కొయ్యాలి నాతోన - దూఱుగా జెప్ప
పెద్దలు మీరింత - బుద్ధి దప్పినను
ముద్దుల నందఱు - చులుకగా నగరె
కాక నాచెల్లెలు - కడు ముద్దరాలు
చిలగా దుర్భావ - లేల పలికితిరి
కోరినకోర్కె చే - కూరినదాక
వరీతినే నూర - కే యుండరాద ?
ఇచ్చట చెప్పిన - యింతి సుభద్ర
వచ్చట రాముతో - నలిగి చెప్పినను
యీ ద్వారకాపురి - యిం దుండబోదు
నవనిపై చరియించు - ముని విన్నగోలు
వని కేలి సేయుచు - నతని వీడ్కొనుచు
ప్రియముతో చనుదెంచె - పిదప తా నంత
నవరత్న కనకసిం - హాసమ్మునను
పేర్మితో గూర్చుండి - పీతాంబరుండు
శిరసు వంచుక యున్న - చెల్లెలి జూచి
దయతోడ బిలిచె నా - త్రైలోక్య పతియు
అమ్మరా ముద్దుల - గుమ్మ రా వేగ
కొమ్మ రా నవకంపు - బొమ్మ రావమ్మ
ముత్యాలసరము రా - ముద్దరాలా రా
చిత్తజుబాణమా - చెలియ రావమ్మ

చిలుకలకొలికి రా - శృంగార కన్య
తొలకరి మెఱుప రా - తోయజగంధి
చందువెన్నెల రావె - భాగీరథి రావె
గండుగోవెల రావె - కమలాక్షి రావె
మచ్చెకంటీ రావె - మాధవళి రావె
అమృతంపుతెప్ప రా - అరవిరిమొగ్గ
బంగారుపిట్ట రా - భాగ్యాలబరణి
తెలయు ముజ్జగముల - వింత నె స్త్రీ
శ్రీకలా తిరుకుల - చెలియ రావమ్మ
కోరు కార్యమ్ము చే - కూరినందాక
అని యుల్లసెమ అన్న - అంకించి పిలువ
పసిడి సలాక నా - పడతి సుభద్ర
వలి పువ్వుగుత్తుల - తలిరాకు బోణి
లలిత సౌరభ శోభ - గులుకరింపంగ
మనిచక్కగాపైట - సవరించు కొనుచు
నడనడ చిన్నారి - నడుము జవ్వాడ
అందెలు మ్రోయుగ - హారముల్ తూగ
మొలనూళ్ల ఘంటలు - ముద్దియల్ మ్రోయు
చిందిదండలు వెగ్గ - సరిపెణల్ దూల
దివ్యలై హారముల్ - తెరువు జూపగను
హంసలనడకలో - నతివ సుభద్ర

అల్ల నల్లనె వచ్చె - అన్న ముందరికి
భద్రేభగమన సు - భద్ర రమ్మనుచు
తోయజాక్షుడు తన - తోడపైన నునిచె
నీలాలవంటివా - నెలత నెఱికురులు
వాలారు కొన గోళ్ల - వడిచిక్కు దీసె
శ్రీకృష్ణు డావేళ - చెల్లెలికి నపుడు
సేవకొప్పటు బెట్టి - చెలువమ్మ తోను
చుబుకంబు పైకెత్తి - చూచి యోదార్చి
మక్కువ నలరించె - మగువ నెమ్మోము
కుంచించుకొని శిరసు - వంచుకొన బోవ
శిరసు తాబైకెత్తి - చెల్లెలిని చూచి
చిఱునవ్వుతో బలికె - శ్రీకృష్ణు డెలమి
యే మన సన్యాసి - యిపుడు నిన్నైన
నాతోన జెప్పిన - నాతి నే బోయి
దుందలించెద నమ్మ - మరియాదగాను
ముద్దరా లోర్చునా - మొప్పెమాటలకు
అని మట్టుపెట్టి యిపు - డాడి వచ్చితిని
రమణి నీ జోలికి - రా నెఱచు నింక
వచ్చిన యప్పుడే - వనిత నేబోయి
యిట్టె బంధించెద - నిపుడె కొట్టెదను
అని బుజ్జగించి చె - ల్లెను గారవించి

చెలువమ్మగా బలికె - శ్రీకృష్ణు డెలమి
మత్తేభగమన నా - మనసు చేకొనవె
మదిరాక్షి నీకొక్క - మాట జెప్పెదను
తగ నేను నేడు ప - ద్నాల్గు లోకములు
వరసి చూచితి నేను - ఆదికాలమున
ఇటువంటి వన్యాని - నెట జూడలేదు
అటు గనుక నీ తోడ - నిటు జెప్పవలసె
శిరసు నాఘ్రాణించి - చెల్లెలి నప్పుడు
కనుగొని పలికె నా - కంజాక్షు డెలమి
యేమని వర్ణింతు - నితని మాహాత్మ్య
మేమని వర్ణింతు - నితని పౌరుషము
ప్రమథగణముతోను - పార్వతీశ్వరుడు
నవతాడ వచ్చితా - చాలంగ నొచ్చె
ఆకాలకంఠుడు - నటు లోడిపోయె
నీతని గెలువగా - నెవ్వరి వశము
ఈయుతీశ్వరుని పే - రెవరు తలచినను
వైరుల గుండెలు - వ్రక్కలై పోను
ఉపవాసముల చేత - నొడలెల్ల స్రుక్కి
యెలమి యెఱుగని వాని - వలె నున్నవాడు
అడవులే మేలాయె - నామునిపతికి
పండ్లు ఫలమ్ములు - భక్షింపు చుండు

ఆకలి గొన్నవ్వా - డాతని భిక్షు
కరని యన్నము పెట్ట - నంద లేరెవరు
కార్యాని కోసమే - కడు చిక్కు పడెను
కార్యము చేసి గ్ర - క్కున నంపవలెను
సుదతి యీతని జూడ - సురపతి సుతుడె
మనసులో నీ కను - మానమ్ము వద్దు
కన్య నీచే భి - క్షము కాని యతడు
అన్యులచే భిక్ష - అందుకోబోడు
దానిచే నీకు నిం - తగ జెప్పవలసె
నెప్పటివలెన నీ - వీ యతీశ్వరుని
తప్పక పూజించు - తరుణి పొమ్మనిన
అన్న మాటలకు తా - నంగీకరించి
మత్తేభగమన గ్ర - క్కున లేచి వచ్చె
అందెలు కదలంగ - హారముల్ వెలుగ
మదిరాక్షి చనుదెంచె - మౌనియింటికిని
పొసగ నానాటి క - పూర్వమ్ము గాను
అఖిల పదార్థమ్ము - లాయత్త పరచు
విందులు కావించు - వేవే విధముల
పొందుగా నతనికి - భుజియింప నిడును
వలపుతో నవియెల్ల - వరుస భుజించి
కడు డస్సి యుంటకు - కారణం బేమి

యీచూపు లేతమక - మీవిలాసములు
యేతాపసుల యందు - నెఱుగ మెన్నడును
విజయుని రూప వి - వేక సంపదలు
గజరాజవరదుచే - గనుమ నే విందు
తెగవాలు కన్నులు - దీర్ఘ బాహువులు
పగడంపు వన్నెగల - పాదపద్మములు
చూడగా నీతండు - క్రీడియే కాని
వాలాయముగ యతీ - శ్వరుడు గా బోడు
కపట సన్యాసిగా - కల్పించి యిచట
వుపమను శ్రీకృష్ణు - డునిచినా డేమొ
అని మనమున జాల - హర్షమ్ము నొంది
శృంగార మమరించె - చెలియ సుభద్ర
పై కొనియెద నంచు - పద్మాయతాక్షి
కోకతో కమ్మ క - స్తురి నలు గిడెను
జాతి గొజ్జగి నీట - జలకమ్ము లాడి
రీతిగా నొకవింత - రేఖ చూపట్టి
తమ్మెత్తపువ్వు వలె - నుతికిన మడత
నఖముల గొని తెచ్చి - నాతి యిచ్చినను
చెంగావి పావడ - రంగు మీఱంగ
చుంగు విడిచి కట్టె - సుదతి సుభద్ర
పాలిండ్ల వలను క - న్పడగ నొకవింత

లీల పయ్యెద కొంగు - లే జాటి విడిచె
నటనతో పైనము - నడచేటి మగువ
రమణ బాగుగ కొంగు - రంగుగా జెలగ
జవ్వాజి పదనిచ్చి - చంద్రకాంతముల
దువ్వెన నెరగోర - దువ్వెన కురులు
పాపట నొసంరి - బాగుగా దీర్చి
చూపట్టు కొప్పు సిం - చుక జాతి ముడిచె
మల్లెలు మొల్లలు - మందారములును
చల్లని జాజులు - సంపంగి విరులు
పారిజాతమ్ములు - బాగుగా తీర్చి
యొయ్యాన తుటిమె నా - యుత్పల గంధి
విటుల మన్మథు డేయు - విరిమొగ్గ తూపు
నటన గుమ్మడి గింజ - నామమ్ము తీర్చి
బసిడి ముత్యాల నొ - ష్పగ పూర్ణచంద్రు
తవమించి చెవుల తా - టంకాలు చేర్చి
మొగపు తీగెకు చెంత - ముత్యంపు కోలికి
జిగిమణుల్ మిగులు మం - జిడి తాళి జేసి
పుంజాల దండ దా - పున నేవళమ్ము
రంజిల్లు భన్నప - రమ్ము క్రీడించ
యున్ని సొమ్ములకును - వన్నె బెట్టినటు
మూడు వేల్ పెలసేయు - ముక్కఱ బెట్టి

కుంకుమ గంధము - కూర్చిన మించు
గోవకస్తూరి బూసె - కొమరారు మేన
పచ్చి పోకలతోడ - పండు టాకులతో
గమ్మన కపుర పి - డెమ్ము గావించె
ఆరామచిలుక భు - జాంగదమ్మునను
రాజసమ్మున నునిచె - రమణి సుభద్ర
ఝుణఝుణత్కారముల్ - నలుప సొమ్ములును
పచ్చలరుచుల స్తం - భమ్మమాటునను
మత్తాక్షి నిలుచుండె - మాని జూచుచును
బృందావనము మీద - వెలయు నా మాని
కమలార్క బింబంబు - గతి బోలువాని
బాలేందుచాయల - పగిది నిరుగడల
నెమ్మిగవుటూర్ధ్వ పుం - డ్రమ్ముల వాని
నొప్పు దండురకావి - నూటార్చినట్టు
కప్పారు నిడువాలు - గడ్డము వాని
మొలకెత్తు ముత్యంపు - మొగ్గల బోలు
తళుకొత్తు శుభ్రదం - తమ్ముల వాని
అలవడు తులసి పూ - సలపేరు వాని
కవగూడ హారినీల - కాంతి తేలించు
తమ్మిపూసల దండ - తన కురము సొంపు
సొమ్ముగా సవరించి - చూపట్టు వాని

యిన్ని విధంబుల - నున్న యా పూని
జూచి సంతోషమున - సుదతి యిట్లనెను
అడిగెద నని పూని - అతివ సుభద్ర
తనమనములో నున్న - తాత్పర్యమునను
చిత్సౌఖ్యరసలత - చిగిరించ గాను
ఉత్సాహమున మేను - ఉబ్బి పొంగగను
పలుకు పల్కుకు తేనె - లొలుకగా నపుడు
పలికె దా నొకమాట - పద్మాయతాక్షి
అయ్య యీరేడేశ - మరసి చూచితిరో
యెయ్యది యీనామ - మెచట నుండుదురో
పరగ నింద్రప్రస్థ - పట్టణమ్మునను
బహుళ సంపదలతో - బరగు చున్నారు
నిరమానసులు కుం - తీసుతుల్ వారు
ఆరయ గడు సుఖు - లై యున్నవార
కోరి మా మేనత్త - కొడుకు లైదుగురు
వారికి కుశలమా - వరమునిచంద్ర
ఆరాజవరులలో - నర్జునుం డెలమి
ధారుణి తీర్థముల్ - దరిసింప నేగె
తీర్థముల్ క్షేత్రముల్ - తిరుగుచో మీరు
ఇంద్రనందను నొందు - నే జూడలేదా
జగతి నంతట మీరు - చరియింతు రనగ

అనిసి మి మ్మిప్పుడు - అడుగంగ వలసె
హరిపాదముల బుట్టి - నట్టి యాగంగ
భూతలమ్మున వెలసి - పొలు పమరు చుండు
మఱి పట్టభద్రుడు - మాయన్న కతడు
వందన మర్పింప - నందు బోబోలు
నని మున్న నింటి నే - నతడు తా నిటకు
వచ్చెంచు చెరిగితే - సంయమినాథ
యీ ద్వారకాపురి - యెంతో దూర మని
తన పురమున కట్టి - తా నేగె నేమొ
అని యిట్లు తా బల్క - నా మునీశ్వరుడు
మౌనమ్ముతో నుండె - మఱి కొంత సేపు
ఓ మునిపుంగవ - యో పుణ్యమూర్తి
గంగాతరంగభం - గ క్రమశుభ్ర
పాథోభర న్యాయ - పర భక్తియోగ
నాథ నా దైనమ - నవి చేకొన గదె
అనుచు సుభద్ర దా - నాడు వాక్యములు
విని చెవివందుగా - విజయు డిట్లనియె
పద్మాక్షి నీతోను - పలుకగా వెఱతు
పలికిన పలుకులు - భావ మేర్పఱచి
దూఱు లెక్కించెదో - తోయజాక్షునకు
వలపు గల్గక యుండ - పలుక గల్గుదునె

పడుచుదనమున నే - పలుకు పల్కులను
మనసులో నుంతువా - నను రాజబుపిని
అను మాటలనువిని - యర్థాంతరములు
లేమ లో భావించి - లేనవ్వు నవ్వె
కామతంత్రము రహ - స్యములు పుష్పించె
చక్కని ముఖ పద్మ - సారస్య మించె
చిక్కని నెమ్మని - జగి విచారించె
తిన్నని మాటల - తేట లాలించె
సన్నంపు నడరంపు - చామ వర్తింపు
మొలక నవ్వులదీవి - ముగుద కెమ్మోవి
తరలాక్షి చెక్కిళ్లు - తరుణి పోకిళ్లు
తిలకించి పులకించి - కలజూచి చూచి
తల యూచి విజయుండు - తానెప గందె
యిటు వంటి బోటికి - యీకోడె కాడె
వచ్చిన వాడని - నాతి నాతరుణు
నచ్చుగా పువ్వువింట - నలినుండు గొట్ట
బృందావనము మీద - ప్రేమతో మాని
కందువ దెలియక - కడు మూర్ఛవోయె
ఓ ముద్దుచిలక ! నే - నుల్కిపల్కితిని
వల దింక వల దని - వ్యవహారింపుచును
బడలిక గొని మాని - పవలించె నంత

నారామచిలుక ఫ - క్కున నేగు దించ
పసిడి రెక్కలు - సొంపు లెసగి యాడగను
మాణిక్యపుంగంఠ - మాలికల్ మెఱయ
పార్థునిభుజముల - పై నిల్చి యపుడు
నయభయములతోను - నరున కిట్లనెను
బావ లేలెమ్మని - బడలికల్ తెలిపి
మోవి గంటిని చేసి - ముద్దులు వెట్టి
యిదియేమి విజయుడా - యీరీతి నుండ
అన్నిట గుణశాలి - వౌదువు నీవు
అర్జున నీమన - మలరుచుండగను
నిర్జరీగతి నాతి - నిన్నాతా నడిగె
నెలమి దుర్యోధ నున - కిచ్చెద ననిన
కడు తాపమును బొంది - కాంత నిన్నడిగె
యిరువురిమననులో - నెల్ల తాపములు
నెఱిగియు నెఱుగని - తెఱ గుండవలెను
ఇంతిని తోడ్కొని - యింద్రప్రస్థమున
కంతో వేడుకల నీ - వేగుదువు గాని
కమలాక్షి పెంచిన - కదు ముద్దుచిలుక
నడుగవలె నా నీకు - అన్నిబుద్ధులకు
మందెమేలమ్ములకు - మఱి వేళ గాదు
అనుచుముంజేతికం - కణముపై వ్రాలె

ఓచెల్ల యని మరి - నాచకోరాక్షి
తడయక తలపోసి - దా నప్పు డడిగె
నెచ్చట నున్నాడో - యెలమి నర్జునుడు
తీర్థమ్ము లేవేవి - తిరుగుచున్నాడో
యేపుణ్యభూముల - కేగి యున్నాడో
వినిపించు మనె - నామె తనకు తెల్లముగ
అనియిట్లు పలుకగా - నామునీశ్వరుడు
అమరగా బలికెను - అతివరో నపుడు
కోమలి యిద్దఱము - గోకర్ణ మందు
కూడియే యుంటిమి - కొన్నాళ్లు లచట
భోజనమ్ములు శయన - ములు నొక్క చోట
చెలియ యుంటిమి మేము - చెలికాండ్ర వలెను
అతనికి నాకును - అరమరి లేదు
అతనికినాకైక్య - మతివరో వినవె
నీరూపు నీరేఖ - నీచక్కదనము
వేమారు తలపోసి - వివశుడై యుండు
నిదురేయిపగలు కం - టికి కూర్కులేద
యింతి నీపై మోహ - మెనగొనియుండు
నెలమి నర్జునునిరూ - పెఱుగనే తాను
రూపల గోరగ - నోపల్లవాంగి
మందారదామమా - మాయన్న చేత

విందుగా నెన్నడు - వెస జూడ లేదు
యుగభుజమ్ములవాడు - మృగరాజనడుము
నడచి పుచ్చుకొను న - న్నడుముగలవాడు
గరగరనివాడు చ - క్కని వాడు నతడు
గొప్ప కన్నులవాడు - కోదండగుణకి
ణాంకంబు లౌబాహు - లమరినవాడు
వెన్నున మచ్చగల - విభవంబువాడు
బవిరి గడ్డమువాడు - పన్నిదం బిడిన
వెన్ను పగదసాల - వెస నాడవచ్చు
చిగురొత్తు చంద్రిక - చెలగు పాదములు
నని విధం బెఱిగింప - నంతట నరుడు
నీవు గుణాఢ్యవు - నీకవ్వ రెదురు
శ్రీహరి చెల్లెలా - శృంగారవతివి
యేవున నీభాగ్య - మేమన వచ్చు
నీవు కిరీటికి - నెలత వై తేని
భావింప నాతని - భాగ్యమే కాద
పూని నీ వడుగగా - బొంక నేమిటికి
మానిని నేన పో - మఱి యర్జునుడను
నన్ను మన్నించి మీా - యన్న శ్రీకృష్ణు
నిన్ను నా కీవలసి - పన్ని నీవిధము
నీకోర్కి నాతలపు - నిగమగోచరుడు

చేకొని నమకూర్చు - చింత యేమిటికి
అరయ గంధర్వ క - ల్యాణమ్ము రాజ
వరులకు తగునంద్రు - వరధర్మ పరులు
అనుచు తమకమ్ముతో - అతఁడు చేయి చాప
ఘనమైన సిగ్గుతో - కాంత యిట్లనెను
తల్లియు దండ్రియు - తగిన బాంధవులు
బల్లిదు లన్నలు - పాయ కున్నారు
వారి యనుజ్ఞచే - వర్తించు టిచట
యీలాగు పనులైన - యిందఱు నగర
వారి నీకు నిచ్చునట - అనుమాన మేల
తెరలి యేనుగునెక్కి - దిక్కు దూరెదకొ
అనిచెప్పి తా నగరి - కరిగి పోయినను
మునియు లతాగృహ - మ్మున కపుడు చనియె
మదనునిచే జిక్కి - మత్తాక్షి రాక
కెదు రెదురై చూచి - యిట్లని పలికె
యింతికి నాపేర - దేల చెప్పితిని
కాంతయు లోనికి - గ్రక్కున బోయె
మరుని పుత్తడిబొమ్మ - మరలె నాచేతి
పరిచర్య లొనరించ - భాషించ దొక్క
సుందరి పాదాల - యందియల మ్రోత
విందునో వీనుల - వెరగందు నొక్క

తెలిసోగ కన్నుల - తెలియగ లేమ
సొలయక తా జూడ్కి - చూచునో లేదో
కొమ్మలతో గూడ - గుజ్జన గూళ్లు
ఆమగువ వడ్డించ - వార్డించ దొకొ
ఏమిచేయుదు నిట - ఒకొకసారి
కామిని చనుదెంచి - కరుణించ దొకొ
మామ కావలెనని - మన్నించి రాద
కాముడు దన్నువే - కారించ దగున
ఉన్నమా తల పెల్ల - సర్వోధరుండు
పన్నుగా తనమతిని - భావించ దెలిసె
ఘనమందిరములకు - గ్రక్కున వచ్చి
తొలమి రుక్మిణి జూచి - యిట్లని పలికె
వెలత నీమరదలు - నేను సన్యాసి
బలభేది సుతుడౌట - పరికించి తెలిసె
పులయుచు వచ్చి తన - మందిరమ్మునకు
తలకొన్న సిగ్గుతో - దా జేరదాయె
అరసియున్నము పెట్టు - మనుచు నియమించి
సారిది వినోదముల్ - చూచుచు నుండె
అంత నక్కడ నతి - యా సుభద్రయును
చింతించి చెక్కుట - చేయిబూని యుండె
మదిలోన తలపోసె - మగువ యిట్లనుచు

యింద్రనందనుడు మ - హేంద్రసుతుండు
చేరి వినయమ్మున - చెట్ట బట్టినను
విడిపించుకొని మరి . వేగ బోయితిని
ఎలమి నాతని మన - స్సెఱుండ నొక్క
కాక దా నోడ బడితే - కదుచుల్క దనము
యీ కడ నందటి - కెన్నిక కాద
యెఱుగదా నాకేల - యింత చింతించ
నిరవైన యీపెండ్లి - యీడేర్చు తనకు
అనుచు చింతింపుచు - నతివ సుభద్ర
హంస తూలిక పాన్పు - నందు పవళించి
ముత్యాల చెఱగుతో - మునుకు తాబెట్టి
అయంబుజాక్షియు - నచటి కరుదెంచి
ఆ మరదలి జూచి - యటు నవ్వి పలికె
కనులేల మూసేవె - కలహంసగమన
శిరసేల వంచేవె - సింహేంద్రమధ్య
వాలుకన్నుల నీరు - రాల నేమిటికె
వనిత సన్యాసిని - వలపించు కొంటి
రామావతారాన - రమణిరో నీవు
శాంతయను పేరుతో - సహజాత వైతి
అల ఋశ్యశృంగుని - అటులోను జేసి
వలవేసి కొంటివే - వనితరో నీవు

దేవేంద్రసుతుదృష్టి - తెగువతో తాక
దృష్టి తీయింతుమే - తెలివి రా నీకు
తెగవాలు కన్నుల - దృష్టించి చూడ
అతనిచేతన కాని - అది మాన దనెను
చిటిమిటి కోపాన - చెలియ సుభద్ర
కరకంకణములచే - కాంతి శోభిల్ల
అరుణ్మణమ్మును - ఆవలికి ద్రోసి
గట్టిగా ముసుగిడి - కాంత యిట్లనెను
యింతి నీపలికిన - యీపలుకు లన్ని
త్రైలోక్య పతితోడ - తా విన్నవింతు
అనిన మరదలి జూచి - అతివ యిట్లనెను
యిప్పుడే చెప్పవే - యిభరాజగమన
మాయన్న మముగూర్చి - మించనాడునటె
జలక మాడుదు లేవె - చెలియ సుభద్ర
తలువ గట్టుదువులే - చందనగంధి
భుజియించుదువు లేవె - పుత్తడి బొమ్మ
వెలది నీకును పెండ్లి - వేగ జేయుదుము
అనిచెప్పి వైదర్భి - యరుదెంచె నంత
సుందవరా నిందిరా - సుందిరమ్మునకు
ఆయింతి పెట్టె నా - యాసొమ్ము లన్ని
కాటంకముల కాంతి - ధవళింపగాను

మొలనూళ్ల ఘంటలు - మొల్లముగ మ్రోయ
నొయ్యాన తనపదు - మూగాపిగాను
ఇంతి పయ్యెదలోన - నేకా తమునను
అచక్రవాకములు - జతివ హారములు
కొమరార కొప్పులో - కొజ్జంగి దండ
నటనతో వీపున - నాట్య మాడగను
జాఱుపయ్యెదకొంగు - చక్క ద్రోయుచును
ఉరిది ముత్యపు సరులు - నుయ్యాల లూగ
ఆదినారాయణుం - డఖిలాండనాథు
దండజవుపానుపున - అతమంద తెలిసి
కోవెల స్వరముతో - కొమరాలు పోయి
చిలుక పలుకులతోను - చెలి విన్నవించె
పుండరీకాక్షు డా - పురుషోత్తముడ
మురవైరి వందిత - మవ్వగోపాల
నారద వినుత యా - నంద ముకుంద
మత్స్యావతార నా - మనవి చేకొనుము
యింతకార్యం బని - యెఱుగని యట్లు
కవ్వడి నేచుట - కామధర్మంబె
అని చెలి యున్న వృ - త్తాంత మంతయును
నెఱిగించె కృష్ణున - కెలమి రుక్మిణియు
హరి వారి తల పంత - నంతయు దెలిపె

వరుసతో దేవకీ - వసుదేవులకును
సారణ ప్రద్యుమ్న - సాత్యాకులకును
ఆరూఢి నుద్ధవు - డప్పు డా తెఱగు
ఆయింద్రసుతునకు - ఆసుభద్రకును
నెయ్యమి కలుగుట - నేర్పున దెలిసె
చయ్యన తనకోర్కె - నమకూడ ననుచు
తొయ్యలి నపుడు పా - ర్థున కియ్యదలచె
ఆయచలమ్మున - యాదవు లెల్ల
భూరి మహోత్సవ - మ్ములు చేయుచుండి
ద్వారకలో సుభ - ద్రా కన్య యుండ
బలరామ కృష్ణులు - పర్వతమ్మునకు
చేయించుచుండిరి - చెలగి యుత్సవము
తమయన్న కృష్ణుని - తలచె సుభద్ర
అమరేంద్రుని దలంచె - అర్జును డపుడు
అంతట శచితోడ - అమరపతి వచ్చె
అచట ముత్తైదువ - లాయరుంధతియు
శచి రుక్మిణీదేవి - సత్యభామయును
ఆవధూవరులకు - నతివ లందఱును
నంపంగి తైలము - చక్కగా నంటి
జలక మిద్దటికిని - నరగున దీర్చి
దివ్యవస్త్రమ్ములు - దివ్యగంధములు

దివ్యమాల్యమ్ములు - దివ్యభూషలును
ధరియించి రవుడు వా - ద్యధ్వనులెసగ
గరుడ గంధర్వులు - గానముల్ సేయ
అలవడ బరగిన - ఆశంభురాణి
నతివపూజించిన - నాయరుంధతియు
మృగనాభివాసనల్ - మొగి గుబుల్ కొనగ
జనులెల్ల పెనగొని - చౌకళింపుచును
అందముగ మృగమధ్య - లమర బాడుచును
కల్యాణవేదికి - కదువేగ రాగ
నాదరాన సుభద్ర - కార్జునునకు
వేదోక్తమున పెండ్లి - విష్ణుండు చేసె
అనయయమ్మున - నమరవల్లభుడు
భాసురమణిమయ - బహుభూషణములు
ఘనమకుటమ్మును - కవ్వడి కొసగి
అనురక్తచిత్తుడై - హరి వీడుకొనిన
అపుడు సుభద్రయు - నార్జునుండు
శచికి దేవేంద్రునకు - సద్భక్తి మ్రొక్క
మ్రొక్కిన యిరుగుర - మొగి లేవనెత్తి
ఆశీర్వదించి యా - యమరేంద్రు డరిగె
నిర్జరుల్ తామును - నిజపురికి నేగ
అర్జును జూచి కం - సారి హర్షించ

అప్పుడు కవ్వడి - యాసుభద్రయును
హరిపాద పద్మముల్ - హర్షమున మ్రొక్క
కడు గారవమ్మున - కౌగిట జేర్చి
కదలేని యటుయ - కాండము లొసగ
రయహయంబుల హేమ - రథమును నొసగ
హరియు రుక్మిణి సూచి - అప్పు డిట్లనిరి
అలరెడి వేడుకల - ననగు మరదలిని
హోమ పీఠమ్మున - నునిచిరివారు
అక్షతల్ శిరసుపై - నాయిర్వురుంచి
ముత్య రత్నమ్ములు - ముగుద యొడినిడిరి
సిగ్గుమురిపెమ్మున - చెలియ సుభద్ర
వద్దికి చనుదెంచె - వదిన ముందటికి
పుత్తడి బొమ్మవలె - పొలతి సుభద్ర
వదిన పాదములపై - వ్రాలుచు మ్రొక్క
మ్రొక్కిన మరదల్ని - మొగి గౌగిలించి
అక్కున జేర్చుకొని - అతివ యిట్లనెను
అడల నేమిటికె మా - యమ్మ సుభద్ర
అత్తయు నీవు మే - నత్తయు గాన
వింతవారెవ్వరు - వీరిలోవలను
బావమరదులు చాల - భక్తి గలవారు
నిను విడిచి మీయన్న - నిమిష మేనియును

నిలువ గిప్పుడె నిన్ను - బిలిచి తెచ్చెదరు
నెల నువ్వ నిప్పుడే - కా బిలుదు గాని
యిచటికి బోయి రా - యిభరాజగమన
నావదిన యుండకే - నా ముద్దుచిలుక
అని బుజ్జగించేటి - ఆసమయమున
ఘనకోటిసూర్య ప్ర - కాశమ్ము భాతి
మకుటమ్ము ధరియించె - మఱియు నర్జునుడు
నిచ్చెసె నంతలో - విజయు డా నతికి
నచ్చిక దండ ప్ర - ణామమ్ము జేసె
నిరజాక్షునిరాణి - నిత్యకల్యాణి
దారిద్ర్యనాశిని - దయగల తల్లి
పాండునందనులకా - ప్రాపనై యెపుడు
కృప జూచి రక్షించు - కువలయనేత్ర
మన్మథుని గన్నట్టి - మరువంపు మొలక
మమ్ము కటాక్షించు - మాధవు రాణి
అనుచు ఫల్గునుడు త - న్నతిభక్తితోడ
స్తవము జేయుచునున్న - కువలయనేత్ర
మకుటమ్ము వట్టిక - వ్వాడి లేవనెత్తె
సత్యాకృపాచార్య - సత్యసంపన్న
సత్యము దప్పని - సర్వజ్ఞ నరుడ
చెలువతో సద్భక్తి - శ్రీకృష్ణుసేవ

కలిగుండు నీ వెల్ల - కాలంబునందు
ననుచు దీవన లిచ్చి - నానమయమున
నక్కున జేర్చుకొని - అతివ కిట్లనెను
చనవిచ్చినాడని - సకియరో నీవు
పలుమాటలకు నెల్లు - పాలువడవద్దు
పొలతి నమ్మగరాదు - పురుషుల నెపుడు
పలుకీతి గృష్ణ న - గ్రమ్ముతై యుంద్రు
కొంచక కృష్ణకు - కూర్మితో నుండు
వంచన సేయకు - వనిత యెవ్వుడును
అనుచు బుద్ధులు చెప్పి - అనుగుమరదల్కి
అర్జునుచేతి కొ - య్యాన నప్పగించి
కోరిక కొనసాగె - కొమరాల నీకు
ఇంద్రనందను గూడి - నేగు మాయమ్మ
అరుగుమి నీవని - అతని వీడ్కొలిపి
నరసఖు డేగె నం - తర్ద్వివమునకు
అరిగిన పిమ్మట - నపుడు కవ్వడియు
దేవకీవను దేవ - దేవులకు మ్రొక్కి
వారిదీవన లంది - వనితను తాను
చయ్యాన చనుదెంచి - సత్యభామకును
వరభక్తితో మ్రొక్కి - వనితయు తాను
అన్న అర్జునుడ యా - అతివతో గూడి

## సుభద్రాకల్యాణము

ఘను వీరు పుత్రుని - గాంచు వేగముగా
అనుచు దీవన లిచ్చి - అతివ యాజ్ఞనావె
అరుగుమి నీవంచు - నతని వీడ్కొలిపె
నరసఖుం డరిగె - నంతర్ద్వీపమునకు
అనిపిన పిమ్మట - నపుడు కవ్వడియు
రథముపై నునుచుకొని - రమణిని నపుడు
పోయేటి వేళలో - పురి గాచియున్న
ఆయుధవాహకు - లారీతి సైరి
ప్రవరసేనుడు కృత - వర్మ యాదిగను
శౌర్యమున నానవ్య - సాచి నడంప
నోరోరి పాండవ - యుద్దండవృత్తి
మా రామకృష్ణులే - మఱి లేమి జూచి
యీ లేమ తోడ్కొని - యెందు బోయెదవు
త్రాలాంకుశౌర్యము - తలపవే మదిని
వాలతి నీ చెత్తుకొని - పోయితి వేని
బలునారసమ్ముల - బడవేతు మనిరి
ఘనగిరితటుల నం - దనవనంబునను
కనిసి బాణమ్ములు - క్రిక్కిఱియనేసె
రమణి సుభద్ర సా - రథ్యంబు సేయ
అమరేంద్రనందను - డానమయమున
కడు కోపమున దన - కాండములచేత

చెనకి వారల నెల్ల - చీకాకు చేసి
ఇంతిని దోడ్కొని - యింద్రప్రస్థముకు
సంతోషమున జనె - సవ్యసాచియును
శౌరి కనుగొని - సంకర్షణుండు
నీరజోదరుడును - నీలాంబరుడును
ఘనభరితాంబర - కనకాద్రినిభుఁడు
నెమ్మితో చనుదెంచె - నీలవర్ణుండు
బలుతెమ్ము జూచి బల - భద్రు డిట్లనియె
యేమి కార్యము గల్గె - యిందాక నీకు
మూన వెన్నటికిని - మందిషేలములు
ఆహా గ్రుడ్డె మించు - నన్నను జూచి
కపటనాటకధారి - కప్పె నొకమాయ
నాగమల్లియతీగ - నవమల్లెతీగె
కలసి పెనగుచునున్న - కడువింత జూపె
నచటి సభాస్తారు - లాసమయమున
పచరింప నర్జును - బహూపరాక్రమము
విజయ నిర్ఘోషముల్ - భేరీరవంబు
రామాది యాదవ - ప్రకరముల్ గొలువ
మదిలోన నుబ్బింత - బెదరైన గొనక
పసివిన నరుడు సు - భద్ర దోడ్కొనుచు
పొదలిన వేడ్క ల - బోయెం గేమి

అటు పట్టితెచ్చెను - యిటు మమ్ము బనుపు
మిడెయని చారులు - నీనిధి బలుక
విని వారి నందఱి - వేగ వారించి
బలభద్రుతో నిట్లు - పలికె శ్రీకృష్ణు
డనఘుడు ధర్మజ్ఞు - డతినీతిపరుడు
తన మేనమరదలి - తాను గొంపోయె
వలదని యెవరికి - వారింప వశము
బలవంతు డాతడు - బహుశస్త్రవేది
అటుగాక ద్రోణుల - కనుగు శిష్యుండు
కదనములో వాని - కదియంగ దరము
యెదిగిన కన్య మన - యింటిలో నున్న
మనము చేయకయున్న - నుగువ బెండ్లాడె
తలప నీపనులకు - ధర్మమా యనిన
వబ్జాతుమాట కం - తౌను గాదనక
తాలాంకు డప్పుడు - తలయూచి యుండె
తల్లియు దండ్రియు - తగిన బాంధవులు
బల్లిదు లన్నలు - పాయకుండంగ
నొకపేద వలె పాయ - నువిద సుభద్ర
సుదతి నీరీతిగా - చూచుచుండుముగ
అని పెడబాటుగా - నన్నతో జెప్పి
అనుగు చెల్లెలికిని - అరణముల్ గొంచు

లక్ష గుఱ్ఱమ్ములు - లక్ష యేనుగులు
అక్షీణ బాహుబలు - లగు వీరభటులు
రమ్యకాంచనమణి - రథసహస్రములు
సౌందర్యవతులైన - సతిసహస్రములు
అన్నయు తమ్ముడు - నతిమోదమునను
అరణమ్ము దెచ్చిరి - యతి శీఘ్రమునను
వనితతో చనుదెంచి - వరు డర్జునుండు
వావిరి నాద్వైత - వనములో నుండ
అచటికి చనుదెంచి - రన్నయుం దాను
నరణమ్ము లిచ్చిరి - ఆదంపతులకు
అపుడు సుభద్రయు - నాయర్జునుండు
ఆరామకృష్ణులకు - నతిభక్తి మ్రొక్క
మ్రొక్కిన యిరువుర - మొగి లేవనెత్తి
విజయుడవుగమ్మంచు - వేడ్క దీవించ
విజయు డంతట నారి - వేడ బూజించె
సంతోషచిత్తుడై - చనిరి ద్వారకకు
అపుడు సుభద్రయు - నర్జును గనియె
యీ చందమున నన్ను - నీక్షించి కృష్ణ
యేమని పలుకునో - యీరసమ్మునను
ఆపలుకు లన్నియు - ఘను తాకు నేము
గోపాలసతులతో - కూడ నన్నునవు

వినిన సంతోషించి - యాకుంతి కనియె
ద్రౌపదికిని మ్రొక్క - తరుణి పొమ్మనిన
వనిత ప్రవేశించి - వచ్చె నవ్వేళ
కుంతికి కృష్ణకు - కూర్మి మ్రొక్కినను
సంతసం బలర పాం - చాలి యిట్లనెను
వనిత నీపతి వీర - వరు డయ్యెనేని
ఘనవీరపుత్రుని - గాంతు వీ వనెను
అంత దీవన లిచ్చి - యపుడు పాంచాలి
సంతోషమున నుండె - సకియతో గూడి
అపుడు ధనంజయుం - డాయింద్రపురికి
వచ్చి ధర్మజునకు - వరభక్తి మ్రొక్కి
తల్లికి సాష్టాంగ - దండ మ్మొనర్చి
వాయునందనునకు - వందనముచేసి
తనకు మ్రొక్కినయట్టి - తమ్ముల నెత్తి
కడు మోదమున తన - కౌగిట జేర్చె
నతివ పాంచాలిని - నక్కున జేర్చె
అంతట ధర్మజుం - డతిమోదమునను
దోగుచు పాంచాలి - తో నిట్లు పలికె
పార్థునకును మాను - భద్ర కిప్పొద్దు
శోభన మగుగాక - చూడు వేడుకన
నానతి గైకొని - యపుడు పాంచాలి

వేవేల యత్నముల - నిందు తగజేసి
నొప్పైనబంగారు - టుప్పరిగలోను
కప్పురవాసనల్ - గ్రమ్ముకొనంగ
సాంబ్రాణిధూమముల్ - నఖ తానువేసి
చిత్రముల్ నిర్మించె - చెలియ యంతటను
దిక్కుల మాణిక్య - దీపముల్ వెలుగ
నిలువుటద్దమ్ముల - నెలత చెక్కించె
వెయ్యి దీపమ్ములు - వెలుగంగ నందు
గవుసెనల్ దీయించె - గాజుకంబముల
బంగారు తరికోళ్ల - పట్టిమంచమ్ము
అంగన వెలయించి - యమరించె సెజ్జ
నన్నవిరిమల్లెలు - జాజిమల్లెలును
బొండుమల్లెలు చాల - నిండ బరపించి
యిరుదెసల్ తలగడ - లిమ్ముగా దాపి
బంగారు సురటి దా - పణతి వెట్టించె
పంకించి బాగాలు - బరణులం బోసి
గాలించి సున్నము - కాయ బెట్టించె
పండుటాకులు దెచ్చి - పణతి మడిపించి
మదిరాక్షి యునిచె ను - మఱియు నచ్చటను
చాఱపప్పు గనగ - సా లానవాలు
శ్రీసుగంధమ్ములు - చిటిబెల్లములును

చెఱుకుబిళ్లలు మంచి - చిఱువిండి నరకు
పసిమిమామిడి పండ్ల - రసములు పిసికి
పసిపచ్చ గిన్నెల - పాలు నే నినిచి
పలువన్నెగిండ్లలో - పన్నీరు నించి
బంగారు చెంబుల - పానక మునిచి
బుంగల దింపించి - గంగోదకములు
పలుకుచిల్కల నుంచి - పంజరమ్ములను
ఈరీతి పనులెల్ల - నింతి తగజేసి
చనుదెంచె పాంచాలి - సంభ్రమమ్మునను
భద్రేభగమన సు - భద్ర రమ్మనుచు
చేడె శృంగారమ్ము - చేయంగ దలచె
పన్నీట స్నానంబు - బాగుగా నార్చి
తెలిబోసి కట్టించె - ధవళవస్త్రమ్ము
విసనకఱ్ఱలగాలి - వీచె నిరుదెసల
పొసగగా తడియార్చ - పొలతి శిరస్సు
ధూపవాసనల లో - దులిపి యల్లార్చి
గొజ్జంగిరేకులు - కొప్పున దుఱిమె
నొడ్డాణమును బెట్టి - నూగాడు మొలను
బిళ్లల మొలనూళ్లు - బిగిసి మ్రోయగను
ఘంటల మొలనూళ్ళు - ఘల్లున మొరయ
కంఠహారమ్ములు - కౌస్తుభమణులు

కాలిపెండెము గూర్చి - ఘనతతోడుతను
అందెల దిద్దె నా - గుణివ సుభద్ర
తళుకు మించిన సంది - దండల పైని
నెలవంక కాయితెల్ - నెతి వృట్ట గట్టె
శ్రీకారములతోడ - చెలగాదూ చెవుల
కమలాక్షి పంజాల - కమ్మలె పెట్టె
సొమ్ము లిన్నిటి మీద - శోభిల్లు నట్లె
మూడువేలుం జేయు - ముక్కుఱ పెట్టె
కుంకుమ గంధము - గూర్చి నా యింతి
గోవకస్తురి బూసె - కోమరాలిమేన
ఆనవాల్ పాయసం - బావులనేయి
పొలతు లందఱు గూడి - పొత్తారగించి
పచ్చివా పోకల - పండుటాకులను
పెచ్చుగా కప్పూర - వీడెమ్ము జేసె
గరిమతో రాచిల్క - కంకణమ్మునను
రాజసమ్మున నవిచె - రమణిసుభద్ర
ఝణఝణత్కారమై - పణతులిద్దఱును
జోడుచిల్కలవలె - శోభిల్లి రవుతు
అక్కడ ధర్మజుం - డర్జునునకును
అతిరక్తితో నలం - కృతులు సేయించె
సవ్యసాచిని జూచి - నన్న గావించె

శయ్యాగృహమునకు - నొయ్యె బొమ్మనుచు
తన నన్నపాదార - విందములు మ్రొక్కి
పానుపు కడకేగి - పార్థు డంతటను
యెదురుచూచుచునుండె - నింతిరాకలకు
మఱచిన తన్నింత - మఱవనీ కుండ
వచ్చునిపింటివా - డెచ్చరించుచును
వేదన కల్పించ్చు - విరహాగ్ని చాయ
ప్రోది చేసినయట్లు - పొడలె చంద్రుండు
అప్పుడా ద్రౌపది - అతివతో ననియె
పట్నమ్ములో వారు - ప్రహరి దిరిగెదరు
పడతిరో వ్రదునాలు - ఘడియలటు చనెను
పజ్జకు జను మన్న - నకియ యప్పుడును
సిగ్గున మురిపెమున - చెలియ సుభద్ర
అడుగు లోడక యుండి - అటుకొంత సేపు
కూరిమి గలవాడు - కోమలాల నీకు
మేలిమి గలవాడు - మేనత్త కొడుకు
నాల్గునెలలు భిక్ష - మేల్గల్గ బెట్టి
యిప్పుడిటువలె సిగ్గు - లేటికే సుదతి
అనుచు సుభద్రను - అతివ తోడ్కొంచు
విజయుని పాన్పున - వేడ్కతో నుంచె
తలుపులు మూసికొని - తరుణి యేతెంచె

తలపోసె మనసులో - తాళంగ లేక
ఏమి వస్తువులైన - నియవచ్చు గాని
ప్రాణేశు నిచ్చి మరి - బ్రతుకంగ రాదు
అఖిలాండ కోటి బ్ర - హ్మాండనాయకుని
చెల్లెలు గనకనే - నొల్ల ననరాదు
అదిగాక సభలోన - అకౌరవులకు
మానభంగము గల్గు - హీనకాలమున
మానధన మొసగిన - మాహాత్మ్యశాలి
అటువంటి శ్రీకృష్ణు - కనుగు చెల్లెలట
అని మరి తలపోసి - అతివ మోదించె
కేళికాగృహములో - క్రీడియు నపుడు
పరిహాసముగ ననియె - పడతితో నగుచు
నాడు చెయి బట్టిన - నాతిరో నీవు
విడిపించి లోపలికి - వేగ బోయితివి
యిపు డెందు బోయెదే - యిభరాజగమన
కనుక సంతోషమ్ము - గానంద తగును
ఓడక వచ్చి నా - యొద్ద గూర్చుండు
మన మరి సిగ్గున - వనిత సుభద్ర
నగుచు తా దివ్వెల - మాటుకే చనెను
కౌవలు నిక్కగ వేయు - కుసుమాస్త్రములన
కామలు నిక్కగ వల - పుల చూపుచూచె

అల మోహనాంగుడు - న్నటుల జూచి దెలిసి
లజ్జించి దిగ్గన - రమణి శోషించ
బిబ్బరితనమున - నెలత చెయివట్టి
అబ్బురమ్మున కౌగి - టదుముకొని తెచ్చి
తొయ్యలిని తొడలపై - నెయ్యమున నునిచి
పొన్నపువ్వులదండ - పొలతికి జుట్టి
కుంకుమగంధమ్ము - కోమలి కలది
బంగారు సురటి చే - పట్టి కిరీటి
అంగనకు విసిరె - నతిముదమ్మునను
ప్రాణేశు పాదములు - పణతి తగ నొత్తె
యెల్ల లోకమ్ములు - నేలిన యట్టి
వల్లభు తోడని - వనిత పుట్టితివి
నీపాదములసేవ - నే జేయవలెను
మాపాదము లొత్త - మగువ నీకేల
యింతటి వాడైన - యా గజేంద్రుండు
మావటీనికి క్రింద - మణిగుండ లేద
పురుషోత్తములతోన - పుట్టితివి గనుక
బుద్ధులకు కొదవటే - పొలతిరో నీకు
అనుచు తేనియబోలు - నతివకు బాలి
పానకంబులు త్రాగి - వల్లారగించి
కర్పూర విడెములు - కడు స్వర్థి జేసె

ఆటు మేను లుప్పొంగ - ఆదంపతులకు
తనువులు పులకించె - నెలకుంబలికి
ఆసుభద్రాదేవి - ఆయర్జునుండు
సంతోషమున నుండ్రి - సర్వకాలమ్ము
అవనిలో తాళ్లపా - కాన్నయ్యగారి
తరుణి తిమ్మక చెప్పె - దాను సుభద్ర
కల్యాణ మను పాట - కదు మంచి తేట
పలుకుల ; నీపాట - పాడినా విన్న
శ్రీహరి వారికి - చేరువై యుండు
నానాట పాపములు - నాశనం బౌను
ఆప్తులు బంధువు - లను బొందగలరు
వస్త్ర సంతానములు - సమకూర గలవు.

సంపూర్ణము.

UNIVERSITY OF HYDERABAD
S.N. Reddy
LIBRARY

తిరుమల తిరుపతి దేవస్థానం ప్రెస్, తిరుపతి—కా. 150 11-8-50

# UNIVERSITY OF HYDERABAD
## LIBRARY
T HYDERABAD ( A. P. )

Cl. No. 81 Acc. No. 28931

T34S DATE DUE

DURATION OF LOAN — Not later than the last date stamped below, failing which fine as per Library Rules will be charged.

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |
| | | |

UNIVERSITY OF HYDERABAD, LIBRARY

Acc. No. 28931 Call No. 81 T34S

Title [illegible]

~~Vols./Year~~

Author [illegible]

| Due on | Borrower's Signature | Returned on |
|---|---|---|
| | | |
| | | |
| | | |

UNIVERSITY OF HYDERABAD

LIBRARY

HYDERABAD (A. P.)

1. Books / Journals should be returned on the due date.

2. Borrowers are responsible for every book / journal taken by them and will be expected to pay for any book / journal damaged, defaced or lost.

Help to keep the book fresh and clean